# 'నస' సమాఖ్య వారి (మా) నస సంచారం

ఊళ్ళో ఓ సినిమా ప్రొడక్షన్ యూనిట్‌వాళ్ళు దిగేరు. వాళ్ళలో ఒక సెమీ పాప్యులర్ నటుడు, కథలూ నాటికలూ పుంఖానుపుంఖంగా రాసి ఆ వేడీ వేగం తగ్గకుండా సినిమా రంగ ప్రవేశంచేసి దర్శకుడై పోయిన ఒక కొత్త కెరటంగారూ వున్నారు. వాళ్ళ కిద్దరికీ సన్మానం. స్థానిక కళా(యి)కారులతో గోష్ఠి ఏర్పాటు చెయ్యాలని సుబ్బారావు వారం రోజుల్నుంచీ యిదై పోతున్నాడు. చివరికి సుబ్బారావు వేదన కార్య రూపం దాల్చింది. సన్మానం చేయించుకోడానికీ, కళాకారులతో గోష్ఠి జరపడానికి ఆ నటుడు, దర్శకుడు వొప్పుకున్నారు.

సన్మానం సందర్భంగా ఎవర్ని పిలవాలి. ఎవర్ని వొది లెయ్యాలి. అన్న పాయింటుమీద సుబ్బారావుకీ నాకూ మధ్య చర్చ జరిగింది. అదయ్యాక తనేమో అతిథుల్ని సభకి పరిచయం చేస్తానని, కార్యక్రమం అంతా అయిపోయాక వందన సమర్పణ చేస్తానని ఆ విధంగా తను రెండుసార్లు స్టేజీమీద కనిపిస్తానన్నాడు_బావుందన్నారు.

"ఉపన్యాస శిరోమణి" శతాధిక సభాధ్యక్షులూ దశాధిక సంఘాల శాశ్వతాధ్యక్షులూ అయిన కృష్ణదేవరాయలుగార్ని ఈ సభకు అధ్య క్షుడుగా వుండమందాం అన్నాడు. సుబ్బారావు, అదీ బాగానే వుంద న్నారు.

నటుడుగా, అధిక ఉత్తీర్ణతలు కలిగిన నటుడుగా (కొండొకచో అనుభవజ్ఞుడైన విటుడుగా) యావన్నగరంలోను ఖ్యాతిగాంచిన మోహనరావుగారు ఈ సభలో సన్మానితుడుగా వస్తున్న సినీ నటుణ్ణి పుష్పమాలాలంకృతుణ్ణి చెయ్యడానికి అభిమాన సంఘాల సమాఖ్య తరపున "మెమోంటో"ను బహూకరించడానికి నిర్ణయమైంది.

నాటక పరిషత్తులో తప్పనిసరి న్యాయనిర్ణేతగా, నటనా దర్శకత్వ పాఠశాల పీఠాధిపతిగా గురుతరమైన బాధ్యతల్ని నిర్వహిస్తూ, "ఒకటవ కృష్ణుడు"గా తనకిసాటి తనే ననిపించుకున్న రామారావుగారు వర్ధమాన సినీ దర్శకుణ్ణి సన్మానించడానికి ఏర్పాటయింది. దానికి నేను ఆమోదముద్ర పడేశాను.

ఇక వక్తలుగా ఇద్దరు కాలేజి ప్రిన్సిపాల్స్ (అందులో వొకాయన రిటైర్డు) ఊళ్ళో భారీ పరిశ్రమగా వెలుగొందుతూ, వెలుగందిస్తున్న అగ్గిపెట్టెల కంపెనీ జనరల్ మేనేజరు, రైలుస్టేషను, పోలీసు స్టేషను, రేడియోస్టేషను, అన్నీ వదిలి పెట్టకుండా యెంచిన పుర ప్రముఖులు నిర్ణయమయ్యారు.

సభకయ్యే ఖర్చుల నిమిత్తం చందాలు వసూలుకి తోడ్పడిన పోలీసాఫీసరుగార్ని కూడా వొదల్లేదు. సభ ప్రారంభం అయ్యేవరకు ముందు కుర్చీల్లో కూర్చునే సన్మానితుల్తో యిష్టాగోష్ఠి నిర్వహించడానికి ఆయనకిచ్చేం ఛాన్సు.

అంత పకడ్బందీగా యేర్పాటుచేసిన సభ కాబట్టే జనం (పిల్చిన వాళ్ళంతా) వొచ్చేరు. (పిలవని వాళ్లుకూడా కొందరు వొచ్చారని తరువాత తెలిసింది మాకు.)

"శ్నాక్సు", టీ అయిపోయాక సభ ప్రారంభం జరిగింది. అయితే మా కృష్ణదేవరాయలుగారు వేదిక యెక్కేసరికి ఎక్కణ్ణుంచో హాఁచ్చని తుమ్ము వినబడ్డాది. సహజమైన తుమ్ములాగే వినపడింది. యాదృచ్ఛికంగా జరిగిందానికి ప్రాముఖ్యం ఇవ్వడం అలవాటు లేక పోడాన్ని తరవాత కార్యక్రమాన్ని కొనసాగించాం. తుమ్ములు కూడా మిమిక్రీ చేస్తారని వూహించలేకపోయాం.

సుబ్బారావు "అతిథుల పరిచయం" మొదలెట్టాడు. సినీనటుడైన మోహన్‌బాబు జీవిత విశేషాలు చెప్పడంతో ఆగిపోలేదు. తనకీ మోహన్‌బాబుకీ పంధొమ్మిదివందల అరవైనాలుగులో సెకండ్ ఫారం చదువుతున్నప్పుడు పరిచయం కావడం ఆ రోజులలో స్కూలువాళ్ళు నిర్వహించిన ఫాన్సీడ్రస్ ఏకపాత్రాభినయం మొదలైన పోటీలలో మోహన్‌బాబు ఎలా ప్రయిజులు కొట్టేసిందీ వర్ణించి చెప్పాడు. తన గురించి కూడా మరచిపోకుండా చెబుతూ వొచ్చాడు. మోహనరావుది మూలకథ, తనది అనుసరణ అన్నాడు. ఆ రోజుల్లలో "అతనిది ఏకపాత్రాభినయం, నాది మేకపాత్రాభినయం" అన్నాడు. "అతనిది మోనోయాక్షను, నాది నోయాక్షను" అన్నాడు.

ఈ చెణుకు లేవీ జనానికి నచ్చలేదు కాబోలు. ఎందుకంటే, జనం

లోంచి వొక కేక— "ఆయన నసరత్న- మీరు నససార్వభౌమ" అని స్పష్టంగా వొచ్చింది.

కృష్ణదేవరాయలుగారు అధ్యక్షోపన్యాసంలో నాటక రంగం, సినిమారంగాలకు గల అనుబంధం కూలంకషంగా వర్ణించారు. ప్రాచ్య పాశ్చాత్య విభేదాలు లేకుండా సినీరంగానికి నటులను, దర్శకులను సరఫరా చేసింది నాటక రంగం అని నొక్కి వక్కాణించేరు. వో అర గంట ప్రసంగించిన తరవాత నాటి సన్మానితుడైన సినీ దర్శకుడు మొదట్లో నాటికలు రాసి వుండడమనే విషయాన్ని ఉదహరించి ఇది కూడా తెలుగు నాటక రంగం సినీరంగానికి చేసిన సమర్పణే నన్నారు. ఆయన ఉపన్యాసం మధ్యలో "నస సామ్రాట్‌కీ"— "జై!" అని ఎవరో పదిహేను సెకం డ్లపాటు నిర్వహించారు. అయినా సభకు అంత రాయం కలగలేదు. ఎందుకంటే, అరచిన వాళ్ళదగ్గిర మైకు లేదు. కనీసం వాకీ టాకీ మౌత్ పీస్ అయినా లేదు.

ముఖ్య అతిథులిద్దరూ వాచీలు చూసుకుంటూ ఉస్సురుస్సురని గడుపుతూ వుండగా మోహనరావుగారు, ఒకటవ కృష్ణుడు మాట్లాడ్డం అయింది. ఎవరూ ఇరవై నిమిషాలకి తక్కువ మాట్లాడలేదు. జనం లోంచి "భలే నసగాడు"- "నసగాళ్ళకు నసగాడు" అని రెండు బిరుదులు వాళ్ళిద్దరికి ఇవ్వడం జరిగింది.

అలాగే, మిగిలిన ప్రాసంగికులకు కూడా "నసగా డొస్తున్నాడు జాగ్రత!", "ఇద్దరు నసగాళ్లు"— "మహా నసగాడు" అని ఈవిధంగా బిరుద ప్రదానాలు చేస్తూ జనం పద్ధతిగా అల్లరి చేస్తూ వుండేసరికి నాకు వొళ్లు మండుకొచ్చింది.

వెంటనే కలగజేసుకొని వేదిక యెక్కి: "మన వూరికి అతిథులు వచ్చినప్పుడు మనం ప్రవర్తించవలసిన విధానం యిది కాదని మైకు పుచ్చుకుని చివాట్లేశాను.

"అబ్బ! 'నసా'శం అంటేటట్లుగా చెప్పావ్రా!" అన్నారెవరో వో మూలనుంచి.

(17-12-77)